క్లుప్తంగా

ఘనంగా వెంకన్న కల్యాణోత్సవం



కలియుగ వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : గుడివాడ కలియుగ వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో టీటీడీ దేవస్థానం సహకారంతో ఏర్పాటు చేసిన ఈ స్వామికి అయిదేళ్లుగా వార్షిక కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేదపండితులు సమక్షంలో అంగరంగ వైభవంగా స్వామి కల్యాణం నిర్వహించారు. పురవీధుల్లో ఉత్సవ మూర్తులు ఊరేగించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన జరిపారు.

బ్రాండిక్స్ పైపులైన్ పనుల్ని అడ్డుకున్న మత్స్యకారులు



పైపులైన్ పనుల్ని నిలిపివేయాలని ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

అచ్యుతాపురం(అనకాపల్లి) : బ్రాండిక్స్ పైపులైన్ పనుల్ని మంగళవారం పూడిమడక తీరంలో స్థానిక మత్స్యకారులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పోలవరపు పారునాయుడు మాట్లాడుతూ ఒప్పందం ప్రకారం బ్రాండిక్స్ యాజమాన్యం పూడిమడక గ్రామాన్ని దత్తత తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న ప్యాకేజీలను చెల్లించాలని డిమాండ్ చేశారు. పూడిమడకలోని యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ అప్పన్న, వాసుపల్లి అశోక్, మేరుగు రాజేశ్, రాజు పాల్గొన్నారు.

సందడిగా వార్షిక క్రీడా వేడుకలు



విజేతలను ప్రశంసా పత్రాలతో అభినందిస్తున్న అతిథులు

పాయకరావుపేట : శ్రీ చైతన్య పాఠశాలలో వార్షిక క్రీడా వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఐ పి.అప్పలరాజు, రిటైర్డ్ పీడీ, రాష్ట్ర అత్యాపాత్యా ప్రెసిడెంట్ కె.జాబేజ్ విచ్చేశారు. క్రీడల వల్ల పిల్లలలో శారీరక దారుఢ్యం, క్రీడా స్ఫూర్తితో పాటు మానసిక ఉల్లాసం కూడా పెంపొందుతుందని వారు పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ పి.మాణిక్యాలరావు మాట్లాడుతూ క్రీడల వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తి అలవడతాయని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి అలరించారు. క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థినీ విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్స్ బహుకరించారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మునగపాకలో వాహన తనిఖీలు

మునగపాక : ప్రతి వాహన దారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ మహమ్మద్ ఆలీ కోరారు. మునగపాక మెయిన్‌రోడ్డులో ఆయన మంగళవారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలీ మాట్లాడుతూ వాహన దారులు తమ వెంట తప్పనిసరిగా రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అతి వేగం అనర్థాయకమన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

'కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

అనకాపల్లిటౌన్ : ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల్ని తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు గంటా శ్రీరాం డిమాండ్ చేశారు. వ్యవసాయ పరిశోధనా స్థానం(ఆర్ఏఆర్ఎస్) ముందు మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన గెజిట్ ప్రకారం వేతనం పెంచాల్సిందేనన్నారు.

జగనన్న కాలనీలు కళ కళ

- తుది దశకు చేరుకుంటున్న ఇళ్ల నిర్మాణాలు
- విద్యుత్, తాగునీటి సదుపాయాల కల్పన
- త్వరలోనే లబ్ధిదారుల గృహప్రవేశాలు



జగనన్న కాలనీకి ఏర్పాటు చేసిన తాగునీటి బోరు



కొరుప్రోలు గ్రామస్తులు నిర్మాణం చేసుకున్న జగనన్న ఇళ్లు



కొరుప్రోలు లేఅవుట్‌లో తిమ్మాపురం గ్రామస్తులు నిర్మించుకున్న జగనన్న ఇళ్లు

ఎస్.రాయవరం : జగనన్న పెద్ద గ్రామంగా కొరుప్రోలులో జగనన్న కాలనీ కనిపిస్తోంది. మండలంలో 8 గ్రామాలకు చెందిన నిరుపేదలకు ఒకే చోట కొరుప్రోలు రెవెన్యూలో ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఇంటి స్థలం ఇచ్చే క్రమంలో లేఅవుట్లు వేసి, సెంటున్నర ఇంటిస్థలం, సువిశాలంగా 20 అడుగులు రోడ్లు కేటాయించి, ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. ఇంటి నిర్మాణాలకు ప్రారంభించే ముందు నిర్మాణానికి అవసరమైన నీటి సదుపాయం, విద్యుత్ సదుపాయం తక్షణమే ఏర్పాటు చేశారు. దీంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి దాదాపుగా తుది దశకు చేరుకున్నాయి. 80 శాతం లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు.

సుమారు 9 ఎకరాల భూముల్లో మూడు లేఅవుట్లు వేసి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. కొరుప్రోలు గ్రామానికి 173 , తిమ్మాపురం180, ఎస్.రాయవరం, పి.ధర్మవరం, పెదగుమ్ములూరు, గుర్రాజుపేట, గోకులపాడు, కోనవానిపాలెం గ్రామాల వారికి 230 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. దీంతో ఒకే రెవెన్యూలో 583 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడంతో పెద్ద గ్రామంగా దర్శనమిస్తోంది. కొరుప్రోలు, గుర్రాజుపేట గ్రామాలకు కేటాయించిన స్థలాల్లో నీరు, విద్యుత్ సదుపాయం ఏర్పాటు చేశారు. రెండు రోజులుగా విద్యుత్ సరఫరా ఇచ్చి నేరుగా ఇంటి నిర్మాణం ప్లాస్టింగ్‌లు పూర్తయిన వాటికి ఉచిత మీటర్లు అందిస్తున్నారు. అతి త్వరలో నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేయనున్నారు.

అద్దె ఇంటి అవస్థలు తప్పాయి



ఇంటి నిర్మాణం పూర్తి కాగానే ఉచితం మీటరు ఏర్పాటు చేశారు. మేము చాలా ఏళ్లు ఇల్లు లేక అద్దె ఇంట్లో ఉంటూ నానా అవస్థలు పడేవాళ్లం. జగన్‌బాబు వచ్చాక స్థలం ఇచ్చారు. నిర్మాణానికి స్కీమ్ ఇచ్చారు. ఇప్పుడు ఉచిత మీటరు కూడా వేసి విద్యుత్ సదుపాయం కల్పించారు. కుళాయిలు కూడా ఏర్పాటు చేశారు. నీరు సరఫరా కావాల్సి ఉంది.

– పినపోతుల రమణమ్మ, గృహిణి, కొరుప్రోలు, ఎస్.రాయవరం మండలం

జగనన్న కాలనీల్లో పూర్తి సదుపాయాలు



కొరుప్రోలు గ్రామంలో ప్రభుత్వ భూమి, డీ పట్టా భూములు ఒకే చోట ఉండడంతో ఎక్కువ మందికి ఇళ్ల స్థలాలు కేటాయించగలిగాం. సమీప గ్రామాల లబ్ధిదారులకు ఇష్టపూర్వకంగా ఇంటి స్థలం ఇచ్చాం. ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకుని గృహ ప్రవేశం చేసుకున్నాక , రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఓటర్ కార్డు మార్పు చేస్తాం. జగనన్న కాలనీల్లో అన్ని సదుపాయాలు పూర్తి స్థాయిలో ఉన్నాయి.

– శ్యామ్, తహసీల్దార్, ఎస్.రాయవరం మండలం

సుధాకర్ గెలుపునకు కృషి



విలేకర్లతో మాట్లాడుతున్న గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : ఎమ్మెల్సీ ఎన్నిక ప్రతిష్టాత్మకంగా తీసుకుని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తామని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు తెలిపారు. కొరుప్రోలు క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటికే గ్రాడ్యుయేటర్ల ఓటరులిస్టు వచ్చిందని, నియోజకవర్గంలో నాయకులకు పంపించి ఓట్లు అడిగే విధంగా ప్రణాళిక రూపొందించామన్నారు. నియోజకవర్గంలో కమిటీ వేసి ఎమ్మెల్సీ ఓట్లు అడిగే క్రమంలో ప్రచారం చేస్తామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నిక ప్రతిష్టాత్మకంగా తీసుకుని మా అభ్యర్థిని గెలిపించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇస్తామన్నారు. ఎమ్మెల్సీ స్థానాల్లో 11 మందికి బీసీ అభ్యర్థులకు కేటాయించి బీసీలకు పెద్ద పీటవేసిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు, జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు చిక్కాల రామారావు, పాయకరావుపేట మండల పార్టీ అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పాయకరావుపేట జెడ్పీటీసీ లంక సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు మామిడి చంటి, శ్రీపతిరాజు, సర్పంచ్‌లు మల్లే లోవరాజు, దారబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతో ఉజ్వల భవిత



మాట్లాడుతున్న ఆర్‌ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకుడు గణేష్

మునగపాక : పదో తరగతి తర్వాత సాంకేతిక విద్యను అభ్యసించడం ద్వారా ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని ఆర్‌ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు శరగడం గణేష్ తెలిపారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం సాంకేతిక విద్యను అభ్యసించడం ద్వారా కలిగే మేలును వివరిస్తూ అవగాహన కల్పించారు. సాంకేతిక రంగాల్లో రాణించేందుకు టెన్త్ తరువాత మంచి చదువును ఎంచుకోవాలన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న రమేష్

కోటవురట్ల : విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టి ఉత్తములుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పైల రమేష్ అన్నారు. కె.వెంకటాపురంలోని జెడ్పీ హైస్కూల్‌ను గ్రామ పెద్దలు, తల్లిదండ్రులతో కలిసి సందర్శించి విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల పట్ల రమేష్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కొందరు విద్యార్థులు ఉపాధ్యాయులను ఎదిరిస్తున్నట్టు తెలిసిందని అటువంటి వారిని ఉపేక్షించవద్దని ఉపాధ్యాయులకు సూచించారు. మెరుగైన ఫలితాల కోసం విద్యార్థులను క్రమశిక్షణలో ఉంచడం అవసరమన్నారు. తరచుగా పేరెంట్ కమిటీ సమావేశాలు పెట్టి విద్యార్థుల మెరిట్ వివరాలు తెలపాలన్నారు. సమస్యలు ఉంటే తల్లిదండ్రులు, గ్రామ పెద్దల దృష్టికి తీసుకురావడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. మాజీ సర్పంచ్ పైల శ్రీరామ్మూర్తి, గ్రామ పెద్ద గొల్లు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

హరిపాలెంలో రెడ్ బుక్ డే



శ్రీ శ్రీ పద్యాలను వివరిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెంలో రెడ్ బుక్ డే దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చదువుదాం..సమాజాన్ని మార్చు దాం అని నినదించారు. జె.వి.వి జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పారావు శ్రీ శ్రీ రచించిన పద్యాలను చదివి వినిపించారు. సమాజంలో మార్పు కోసం శ్రమజీవులు, కష్టజీవులు కలసిరావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము, మండల కార్యదర్శి కె.సోమునాయుడు, జె.వి.వి.కార్యదర్శి రామ్‌కుమార్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కర్రి అప్పారావు, రామ సదాశివరావు, నాయుడు, బుద్ధ రంగారావు, రవి కుమార్ పాల్గొన్నారు.

వ్యవసాయ గణాంక వివరాలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న జిల్లా ఉప గణాంకాధికారి రాజేశ్వరి

మునగపాక : మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వ్యవసాయ గణాంకాలకు సంబంధించి సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా అర్థ గణాంక శాఖాధికార కార్యాలయం నుంచి ఉప గణాంకాధికారి పి.ఎల్ రాజేశ్వరి అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ గణాంక వివరాలు సేకరించేందుకు ప్రత్యేక యాప్ అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం 11వ ప్రపంచ వ్యవసాయ గణాంక వివరాల సేకరణపై దృష్టి సారించిందన్నారు. రైతుల వివరాలు సేకరించాలన్నారు. మధ్య తరగతి రైతులు, చిన్నకార, సన్నకార రైతుల వివరాలు సేకరించేందుకు వీఆర్వోలు పాటుపడాలన్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్, ఇన్‌చార్జి మండల గణాంకాధికారి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించాలి



రాంబిల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

రాంబిల్లి : ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబు) కోరారు. రాంబిల్లిలో ఆయన స్వగృహం వద్ద మంగళవారం సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో సుధాకర్ పోటీ చేస్తున్నారని, ఆయన విజయానికి అందరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి సుకుమారవర్మ(తేజ), ఎంపీపీ జి. శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ శిరీష

రాంబిల్లి: గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎంపీపీ జి. శిరీష అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తాగునీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పూర్తయిన ఇళ్లకు సంబంధించిన పేమెంట్లు లబ్ధిదారులకు అందేలా చూడాలని పలువురు సభ్యులు కోరారు. సభ్యులు తెలిపిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ శిరీష మండల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైస్ ఎంపీపీలు కొటాపు లక్ష్మి, కశిరెడ్డి నర్సింగరావు, ఎంపీడీవో కె.ఎస్.కొండలరావు పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్ఐ దీనబంధు

రాంబిల్లి : విద్యార్థినులపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ దీనబంధు హెచ్చరించారు. లాలంకోడూరు జూనియర్ కళాశాల, రాంబిల్లి కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి కళాశాల, పాఠశాలల్లో ఫిర్యాదు బాక్స్‌లు ఏర్పాటు చేయాలన్నారు. వీటిలో ఫిర్యాదుల పత్రాలు వుంచాలన్నారు. విలేజ్ పోలీసు, ఫ్యాకల్టీ, స్టూడెంట్, కానిస్టేబుల్‌తో ప్రతి కళాశాలలో కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి బాగా చదువుకోవాలని ఎస్ఐ సూచించారు.

ఆర్‌డీవో పర్యటన



సివిల్ సప్లై గోదామును పరిశీలించిన ఆర్‌డీవో

పాయకరావుపేట : నర్సీపట్నం ఆర్‌డీవో జయరాం మండలంలో మంగళవారం పర్యటించారు. పట్టణంలో గల సివిల్ సప్లై గోదామును పరిశీలించారు. అనంతరం పీఎల్ పురం గ్రామ రెవెన్యూలో ఐ.టి.ఐ. నూతన భవనం నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. అదే విధంగా మంగవరం గ్రామంలో పెట్రోల్ బంక్ స్థలాన్ని పరిశీలించారు. డీటీ నూకరాజు, సర్వేయర్ సత్తిబాబు పాల్గొన్నారు.

'మాతృ భాషతోనే ఎదుగుదల'

అనకాపల్లిటౌన్ : ప్రతి ఒక్కరి మానసిక ఎదుగుదల మాతృభాషతోనే సాధ్యమని, మన మాతృభాష తెలుగును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సిద్ధార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం తెలిపారు. స్థానిక వన్‌వే ట్రాఫిక్ కూడలిలోని తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేసి అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుభాష గొప్పతనాన్ని ఎందరో మహానుభావులు తమ రచనల ద్వారా ప్రజ్వలింపజేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. పట్టణంలో హిమశేఖర్ కళాశాలలో జరిగిన మాతృభాష దినోత్సవంలో కరస్పాండెంట్ కె.జనార్ధన్ తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుభాష ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.

ప్రతిష్టాత్మకంగా ఎమ్మెల్సీ ఎన్నికలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



సమావేశానికి హాజరైన ప్రజా ప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు

- సుధాకర్ గెలుపు సీఎంకు కానుక కావాలి
- యలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : ఉత్తరాంధ్ర అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతుందని ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు కోరారు. వచ్చే నెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న సుధాకర్ విజయం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణమూర్తిరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ ఎన్నికపై దృష్టి సారించారన్నారు. సుధాకర్ విజయాన్ని జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఓటరును పదేపదే సార్లు కలుస్తూ మనకు అనుకులంగా మలుచుకునేలా కృషి చేయాలన్నారు. విశాఖను పరిపాలన రాజధానిగా తీసుకురావడం ద్వారా ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకొని సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. అలాగే ప్రతిపక్ష పార్టీల తప్పుడు ప్రచారాలను తిప్పికొడుతూ సుధాకర్ విజయమే లక్ష్యంగా పాటుపడాలన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ మాట్లాడుతూ అవినీతి రహిత పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకునేలా సుధాకర్‌ను గెలిపించుకోవాలన్నారు. ఒకవైపు జరుగుతున్న సంక్షేమం మరో వైపు జరుగుతున్న అభివృద్ధిని ఓటర్లకు వివరిస్తూ ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ విజయం కోసం పాటుపడాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, సచివాలయ మండల కన్వీనర్ పొలిమేర గణేష్, పార్టీ నేతలు షేక్ ఇస్మాయిల్, మళ్ల ఉమామహేశ్వరరావు, దొడ్డి సూరప్పారావు, దొడ్డి బాలాజీ, కోటేశ్వరరావు, దాసరి అప్పారావు, దిమ్మల అప్పారావు, ఆడారి కాశీబాబు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ అప్పలరాజు

పాయకరావుపేట : స్థానిక శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాలలో పోలీసు శాఖ ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు, ఉపయోగించడంపై విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐ పి.అప్పలరాజు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యువత ఎదుర్కొంటున్న సమస్యలు ముఖ్యంగా ఈవ్ టీజింగ్, లైంగిక వేధింపులు, సైబర్ క్రైమ్స్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. తాము కళాశాలలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెలో ఫిర్యాదులు అందించినట్టయితే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కళాశాలలో ఒక కమిటీని కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎస్ఐ బి.జోగారావు, మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, తద్వారా వారు ఎదుర్కొనే చట్టపరమైన చర్యలు గూర్చి విద్యార్థులకు వివరించారు. అటువంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వీర్రాజు, వైస్ ప్రిన్సిపాల్ పెనుగొండ సుబ్బారావు, ఏఎస్ఐ జె.గోవిందరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ ఎమ్మెల్సీ ఎన్నిక ఎంతో కీలకం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): రాజకీయాల్లో విజయం కోసం పట్టుదల కనబరచాలని, ఎలాంటి ఎన్నికల్లోనైనా విజయం కోసం పోరాడాలని యలమంచిలి ఎమ్మెల్యే ఉప్పలపాటి రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) అన్నారు. అచ్యుతాపురం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న సుధాకర్‌ను గెలిపించాలని సూచించారు. విశాఖ రాజధాని అంశం కీలకం అయినందున ఈ ఎమ్మెల్సీ ఎన్నిక కీలకం అయ్యిందన్నారు. బీసీలకు పెద్దపీట వేస్తూ ఇటీవల నామినేటెడ్ ఎమ్మెల్సీ స్థానాలకు సీఎం అభ్యర్థులను ప్రకటించారని గుర్తు చేశారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, జెడ్పీటీసీ లాలం రాంబాబు, కో-ఆప్షన్ జెడ్పీ సభ్యుడు నర్మాల కుమార్, మండల పార్టీ నాయకులు కోన లచ్చన్నాయుడు, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ, మండల సచివాలయాల కన్వీనర్ విజయ్, పార్టీ అధికార ప్రతినిధి పిన్నంరాజు వాసు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంతో ఉన్నత శిఖరాలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): పోటీ ప్రపంచంలో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని సెట్విస్ జిల్లా మేనేజర్ బి.నూకరాజు సూచించారు. అచ్యుతాపురం మండలంలోని కైట్స్ కళాశాలలో మంగళవారం యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. నూకరాజు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఉత్పన్నమయ్యే ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, అవకాశాలను బట్టి నైపుణ్యాలు పెంపొందించుకోవాలని అన్నారు. రాంబిల్లి ఎన్‌జీవో నూకరాజు మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. కళాశాల కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.అప్పలనాయుడు, ఎ. సన్యాసిరావు పాల్గొన్నారు.

ధ్యానంపై పెరుగుతున్న ఆసక్తి



నాగులాపల్లి ధ్యానకేంద్రాన్ని సందర్శించిన బుద్ధ సీఈవో ప్రాజెక్ట్ అధినేత చంద్రశేఖర్

మునగపాక : ప్రపంచ వ్యాప్తంగా ధ్యానంపై ఆసక్తి రోజురోజుకూ పెరుగుతుందని బెంగులూరుకు చెందిన బుద్ధ సీఈవో ప్రాజెక్ట్ అధినేత చంద్రశేఖర్ పేర్కొన్నారు. నాగులాపల్లిలోని చంద్రశేఖర మహాస్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానం చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు ప్రశాంతత లభిస్తుందన్నారు. నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే వారికి ధ్యానం ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ధ్యాన గురువు సుజాత పాల్గొన్నారు.

డీఈవోకు యూటీఎఫ్ నేతల అభినందన

అనకాపల్లిటౌన్ : విద్యా వ్యవస్థ బలోపేతానికి ఉపాధ్యాయ సంఘాలు ప్రధాన భూమిక పోషించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం యూటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి డీఈవోను అభినందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి, గౌరవాధ్యక్షుడు ఎన్.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి, కార్యదర్శి జి.ఎస్.ప్రకాష్, మండల నాయకులు దేవుడునాయుడు, ఎస్.నూకరాజు, కె.కామరాజు, రమేష్, రవి, శ్రీను, స్వామి, అలివేలు, అజయ్, రేఖ, అరుణ, తేజ, వర్ధన్ పాల్గొన్నారు.